క్లుప్తంగా

రెండు ఇసుక టిప్పర్లు సీజ్

విస్సన్నపేట: సరైన అనుమతి పత్రాలు లేకుండా టిప్పర్లలో ఇసుక రవాణా చేస్తున్న రెండు ఇసుక టిప్పర్లను శుక్రవారం రాత్రి విస్సన్నపేట చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ జి.రామకృష్ణ శనివారం తెలిపారు. రెండు టిప్పర్లను సీజ్ చేసి వాల్టా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆలయంలో అభివృద్ధి పనులు

మైలవరం:రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామం బీసీ కాలనీలో వేంచేసియున్న శ్రీఆంజనేయస్వామి దేవాలయానికి నాగులూరు దొర రామారావుబాబు ప్రోత్సాహంతో ఆయన సోదరుడు కలకొండ వంశీబాబు ధర్మపత్ని కలకొండ కృష్ణప్రియ గుడి ఆవరణలో రూ.65వేలు సొంత నిధులతో రేకులు , టైల్స్‌ను ఏర్పాటు చేయించారు. దేవాలయం అభివృద్ధికి తోడ్పడిన వారిని గ్రామస్తులు అభినందించారు. కాలనీ పెద్దలు తన్నీరు ఎల్లయ్య, బెజవాడ చంటి, రామారావు పనులు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు.

నగర పంచాయతీ కార్మికుల ధర్నా

తిరువూరు:తల్లికి వందనం పథకంలో తమకు లబ్ధి చేకూర్చకపోవడంపై తిరువూరు నగర పంచాయతీ కార్మికులు శనివారం కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలో నగర పంచాయతీ కార్మికుల పిల్లలకు తల్లికి వందనంలో అవకాశం ఇవ్వకపోవడం దారుణమని సీఐటీయూ మండల కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. కేవలం తక్కువ వేతనాలతో జీవించే కార్మికులు పిల్లలను చదివించడానికి నానా తంటాలు పడుతుంటే ప్రభుత్వం వారిని ఎందుకు అనర్హులుగా గుర్తించిందో వెల్లడించాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయకపోతే ఆందోళన చేపడతామని తెలిపారు.

యోగాతో మానసిక వికాసం



తిరువూరు:మానసిక వికాసానికి, ఏకాగ్రతకు ప్రతి రోజూ యోగా చేయాలని తిరువూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఉద్యోగులకు, వాకర్స్‌కు యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యోగాసనాలతో శారీరక, మానసిక పరిపక్వత వస్తుందని పేర్కొన్నారు. ఇతర వ్యాయామాల కంటే యోగా మెరుగైనదని చెప్పారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తాళ్ళూరి రామకోటేశ్వరరావు, తహసీల్దార్లు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నూజివీడు: విద్యుత్ సిబ్బంది, అధికారుల్లో నెలకొన్న నిర్లక్ష్యం విద్యుత్ తీగలకు పాకుతోంది. విద్యుత్ స్తంభాలకు, వైర్లకు మొక్కలు, తీగలు పాకి ప్రమాదకరంగా మారుతున్నా సంబంధిత అధికారులకు పట్టడం లేదు. నూజివీడు ఎంప్లాయీస్ కాలనీ ఎల్ఐసీ కార్యాలయం రోడ్డులో విద్యుత్ స్తంభానికి, తీగలకు సైతం పిచ్చిమొక్కల తీగలు పాకి ప్రమాదకరంగా మారాయి. ఈ మొక్కల తీగలను తొలగించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

పట్టుదలతో విద్యార్థులు రాణించాలి

మైలవరం:లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడవ గ్యాడ్యుయేషన్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూకే రెక్టార్ ప్రొఫెసర్ కేవీ రమణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గౌరవ అతిథిగా గ్లోబల్ డెలివరీ లీడర్ అండ్ ఏఐ ప్రాక్టీస్ లీడర్ ఐబీఎమ్ బెంగళూరుకు చెందిన సుప్రియ దేవదత్త హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కేవీ రమణ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో కళాశాల ఉన్నత ప్రమాణాలు పాటిస్తుందని తెలిపారు. యువ గ్రాడ్యుయేట్‌లను సమాజానికి రూపొందించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. కృషి, పట్టుదలతో ఆయా రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎల్ ప్రసాదరెడ్డి, ప్రసంగించారు ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలువురు వ్యవసాయాధికారుల బదిలీ

నూజివీడు: నియోజకవర్గంలోని పలువురు మండల వ్యవసాయాధికారు (ఏఓ)లు బదిలీ అయ్యారు. ఆగిరిపల్లి ఏఓ పి.చెన్నారావు నూజివీడు మండలానికి, బాపులపాడు ఏఓ జొన్నలగడ్డ భవాని ఆగిరిపల్లి, నూజివీడు ఏఓ ఆలూరి చాముండేశ్వరి ముసునూరు, టెక్నికల్ ఏఓ కె.చిన్న సూరిబాబు జి.కొండూరు ఏఓలుగా బదిలీ అయ్యారు. సూరిబాబు స్థానంలో గొల్లపూడిలోని భూసార పరీక్ష కేంద్రం ఏఓ కె.మాధవి ప్రియానంద బదిలీ అయ్యారు. వీరందరూ బాధ్యతలు స్వీకరించారు.

కౌలు ధరలతో సాగు భారం!

- ముందస్తు కౌలుతో రైతులు విలవిల
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపు



కేతనకొండలో ట్రాక్టర్‌తో పొలం దున్నుతున్న రైతు

ఇబ్రహీంపట్నం:ఏటా పెరుగుతున్న పెట్టుబడి, కౌలు ఖర్చులతో వ్యవసాయం భారంగా మారింది. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం పెట్టుబడి రాక కౌలు రైతులు నష్టాల పాలవుతున్నారు. పెట్టుబడితో సంబంధం లేకుండా యజమానులు ముందస్తు కౌలు పెంచుతుండటంతో కౌలు రైతులు వ్యవసాయం చేయడానికి జంకుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో సుమారు 4వేల మంది కౌలు రైతులు మినుము, మొక్కజొన్న, పుల్లశనగ, వరి, పత్తి కూరగాయ పంటలను సాగు చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోయినా అతికష్టంపై నెట్టుకొస్తున్నారు. కౌలు ధరలు భారీగా పెంచేయడంతో వ్యవసాయంపై ఆధారపడిన రైతులు అప్పుల భారంతో కుంగిపోతున్నారు.

భారీగా పెరిగిన కౌలు ధరలు.....

మండలంలో రైతుల కంటే కౌలు రైతులు ఎక్కువగా ఉన్నారు. వ్యవసాయ భూములు కలిగిన రైతులు కౌలుకు ఇచ్చేసి పట్టణాలకు వెళ్లి సెటిలైపోతున్నారు. కౌలుకు తీసుకున్న రైతులు అష్టకష్టాలు పడి నష్టమైనా, లాభమైనా వ్యవసాయాన్ని జీవనాధారం చేసుకుని నెట్టుకొస్తున్నారు. సొంత భూములు కలిగిన రైతులు రెండేళ్లుగా ముందస్తు కౌలు ధరలు భారీగా పెంచేశారు. కొటికలపూడి, జూపూడి, చిన లంక, పెదలంక, మూలపాడు, తదితర గ్రామాల్లో నీటి సదుపాయం కలిగిన ఎకరా భూమికి రూ.25 వేలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. లంక భూములు సైతం అదే ధర పలకడం గమనార్హం. లోతట్టు ప్రాంతాలు, నీటి సదుపాయం లేని పొలాలు రూ.15 వేలు నుంచి రూ.20 వేలుకు తీసుకుంటున్నారు. ఆరుగాలం కష్టించిన రైతులకు వచ్చే ఆధాయం వడ్డీలకు సరిపోవడం లేదు.

మాగాణి పొలాలకూ అదే ధర...

మండలంలో సుమారు 4వేల ఎకరాల్లో కౌలు రైతులు వరిసాగు చేస్తారు. ఎకరాకు కౌలు ధర కింద 12 బస్తాలు పొలం యజమాని తీసుకుంటారు. మార్కెట్ ధర మేరకు బస్తా రూ.2వేలు చొప్పున రూ.24 వేలు కౌలు రైతు భరించాల్సి వస్తుంది. గతేడాది వచ్చిన వరదలకు పంటలు తుడిచిపెట్టుకుపోవడంతో ఈ ఏడాది ముందస్తు కౌలు చెల్లించాలని యజమానులు రైతులపై ఒత్తిడి పెంచుతున్నారు. పత్తి, మిర్చి, మినుము, మొక్కజొన్న, శనగ వంటి పంటలు సాగుచేసిన రైతులకు గడిచిన ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు, గిట్టుబాటు ధర లేక అప్పుల్లో కూరుకుపోయారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్ట పరిహారంతో సంబంధం లేకుండా కౌలు చెల్లించాలంటూ యజమానులు ఒత్తిడి తెస్తున్నారు.

రుణాలు మంజూరు చేయాలి....

ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తామని గతేడాది ప్రకటించినప్పటికీ నేటికీ ఆచరణలోకి పెట్టలేదు. ప్రభుత్వం రైతులకు అందించే ఎటువంటి సాయం అయిన భూయజమానులకే చెందుతుంది. కౌలు రైతులను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవడం లేదు. ఇకనైన ప్రభుత్వ సహాయంతో పాటు బ్యాంకు రుణాలు సైతం కౌలు రైతులకు మంజూరు చేసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కౌలు ధరలపై నియంత్రణ ఉండాలి



గతంలో 40 ఎకరాలు కౌలు భూమిలో సాగు చేశాను. ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా నష్టపోయా. ఈ ఏడాది 25 ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నా. గతేడాది మొక్కజొన్న పంట అగ్నికి ఆహుతైంది. ఇప్పటి వరకు ఎటువంటి పరిహారం రాలేదు. దిగుబడులు, ఆశించిన ధరలు లేక నష్టపోతున్నాం. కౌలు ధరలపై నియంత్రణ ఉండాలి.

– గాలీసైదా, రైతు, దాములూరు

ఏటా పెరుగుతున్న ధరలు



కౌలు ధరలు ప్రతి ఏటా పెరిగిపోతున్నాయి. ఎకరా కౌలు రూ.25 వేలు ధర పలుకుతుంది. నీటి సదుపాయం లేకుంటే రూ.15 నుంచి 20 వేలు చెబుతున్నారు. పెట్టుబడులు సైతం భారీగా పెరిగాయి. ముందస్తు కౌలు, వ్యవసాయ పెట్టుబడి పెట్టాలంటే ప్రకృతి వైపరీత్యాలతో భయమేస్తుంది. పెరిగిన కౌలుతో సాగు భారంగా మారింది.

– పి.బాపయ్య, రైతు, కొటికలపూడి

విద్యార్థులకు ప్రోత్సాహక నగదు



విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఈ ఏడాది ఎస్ఎస్‌సి–2025 పరీక్షల్లో ప్రతిభ కనబర్చి అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ప్రోత్సాహక నగదు బహుమతిని శనివారం అందచేశారు. మైలవరంలో షైనింగ్ స్టార్స్ 2025 పేరుతో జరిగిన కార్యక్రమంలో స్కూల్ ప్రథమ టి.సాయికృష్ణ (540), ద్వితీయ వి.నాగస్యా (538), తృతీయ ఆర్.లక్ష్మి (536) మార్కులు సాధించిన ఒక్కొక్క విద్యార్థికి రూ.5వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందించి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఓ.నాగేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైలవరం:ఇటీవల జరిగిన పదవ తరగతి, ఇంటర్ మీడియెట్ పరీక్షలలో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తన సొంత నిధులతో ప్రోత్సాహక నగదు బహుమతులు శనివారం అందజేశారు. మైలవరం ఎస్వీఎస్ కళ్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన రైజింగ్ స్టార్ అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ గిరిబాబు

విస్సన్నపేట:గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశామని సీఐ గిరిబాబు తెలిపారు. శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎస్ఐ జి. రామకృష్ణకు వచ్చిన సమాచారం మేరకు పుట్రేల రోడ్డులో శనివారం వాహనాలు తనిఖీ చేశారు. బ్యాగ్‌లో గంజాయి కలిగిఉన్న ఆత్కూరి ప్రిన్స్ అనే వ్యక్తిని అరెస్టు చేశామని తెలిపారు. తహసీల్దార్ కె.లక్ష్మీకళ్యాణి, రెవెన్యూ అధికారుల సమక్షంలో బ్యాగ్ పరిశీలించగా బ్యాగ్‌లో 1 కేజీ 440 గ్రాముల గంజాయి ఉందని పేర్కొన్నారు. గంజాయి సేవించటానికి అలవాటు పడటంతో పాటు గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి ఏలూరు, విజయవాడ పరిసర ప్రాంతాలలో విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు తమ విచారణలో వెల్లడైందని చెప్పారు. ఒరిస్సా నుంచి గంజాయి కొనుగోలు చేసుకొని ఈ ప్రాంతానికి తీసుకొచ్చాడని వివరించారు. ప్రిన్స్‌పై గతంలోనూ పలు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు వాడటంకానీ, రవాణా చేయడం చట్ట విరుద్ధమని తెలిపారు. ఇటువంటి కేసుల్లో పట్టుబడితే సంవత్సరం జైలు శిక్షతో పాటు వారి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుద్ధ్యం



చాట్రాయి సెంటర్లో ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)



చనుబండ పాత దళితవాడలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)

- డ్రైయిన్లు లేక ఎక్కడికక్కడ నిలిచిపోతున్న నీరు
- రోగాల బారిన పడుతున్న జనం

చాట్రాయి: పచ్చని పల్లెలు దేశానికి పట్టు కొమ్మలు. అటువంటి పల్లెల్లో పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైయినేజీలు లేకపోవడంతో కురిసిన వర్షం కాలనీల్లో నిలిచి దోమలకు నిలయంగా మారుతున్నాయి. వర్షాకాలం వచ్చిందంటే గ్రామాల్లోని కాలనీల్లో నిలిచిన నీరు చెరువులను తలపిస్తుంది. చాట్రాయి మండలంలో ఈ పరిస్థితులు నెలకొన్నాయి. నెలల తరబడి నిలుస్తున్న నీటిలో దోమలు పెరిగి విష జ్వరాలు విజృంభించి, గత రెండేళ్లలో వర్షాకాలంలో చికున్ గున్యా, మలేరియా టైఫాయిడ్ లాంటి విష జ్వరాలతో చాలా మంది చనిపోయిన విషయం విదితమే. గతేడాది విష జ్వరాల వల్ల కాళ్లు నొప్పులు రావడంతో సత్తుపల్లి, విజయవాడ, విస్సన్నపేట, వేంసూరు పలు పట్టణాల ఆస్పత్రుల్లో బాధితులు వైద్యం చేయించుకున్నారు. వైద్యం కోసం అనేక వ్యయ ప్రయాసాలకు లోనయ్యారు. ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారు. వర్షాలు కురిసి నీరు నిలిచినపుడు మాత్రమే పారిశుద్ధ్యంపై హడావుడి చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు అనంతరం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లోని కాలనీల్లో డ్రైయినేజీలు ఏర్పాటు చేస్తే సీజనల్ వ్యాధులు కొంత మేరకు అరికట్ట వచ్చునని చెబుతున్నారు. వర్షాకాలం వచ్చినందున ముందుగానే గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం...

గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ,గ్రామ పంచాయతీల్లో చెత్త కుప్పలు తొలగించి నీటి నిల్వలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చాట్రాయి

రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీకి జెడ్పీ బాలికల ఎంపిక



కొండపల్లి(ఇబ్రహీంపట్నం):జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో జెడ్పీ బాలికల పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు ఉత్తమ ప్రతిభ చాటారు. హిందూస్థాన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో శనివారం జరిగిన అండర్ 15 బాలికల వాలీబాల్ జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో పాఠశాలకు చెందిన 9వ తరగతి బాలికలు జె.హేమదేవి, జి.ఫణి నాగదీపిక, పి.యక్షిబ, పి.వెంకటదుర్గ ఉత్తమ ప్రదర్శన కనబర్చారు. ఈ నెల 24, 25 తేదీల్లో బెంగళూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌కు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం హేమలత తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ బాబ్జీ పీడీ రత్నం బాలికలను అభినందించారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి

నూజివీడు: అన్నదాత సుఖీభవ, ప్రధాన మంత్రి కిసాన్ పథకాలకు సంబంధించి లబ్ధి పొందాలంటే ప్రతి రైతూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని నూజివీడు ఇన్‌చార్జి ఏడీఏ చాముండేశ్వరి శనివారం తెలిపారు. గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సిబ్బంది ఈకేవైసీ చేస్తున్నారని చెప్పారు. ఈకేవైసీ ఈ నెల 20తేదీలోగా చేయించుకోవాలని పేర్కొన్నారు. రైతులు ఆధార్ కార్డు నెంబరు లేదా పట్టాదారు పాసుపుస్తకం ఖాతా నెంబరు ద్వారా ఈకేవైసీ చేస్తారన్నారు. భూమి వేరే గ్రామ పరిధిలో ఉన్నప్పటికీ రైతు నివసించే గ్రామంలోని రైతు సేవా కేంద్ర వద్దకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవచ్చన్నారు.

పద్య నాటక వైభవాన్ని చాటిన హరిశ్చంద్ర నాటకం

విజయవాడకల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ, సృజనాత్మక సమితి, జయంతి నాట్య మండలి సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదికపై శనివారం ప్రదర్శించిన సత్య హరిశ్చంద నాటకం పద్యనాటక వైభవాన్ని చాటింది. బలిజేపల్లి లక్ష్మీకాంత కవి, మహాకవి జాషువా రచించిన నాటకాన్ని నటీనటులు పాత్రోచితంగా నటించారు. ఇచ్చిన మాట కోసం సమస్త రాజ్యాన్ని వదులు కోవడం, చివరకు భార్యబిడ్డలను కూడా అమ్ముకోవడం కాటి కాపరిగా మారటం అంశాలుగా నాటకం సాగింది. హరిశ్చంద్రునిగా జి.లక్ష్మయ్య, వివేకానంద స్వామి, నక్షత్రకునిగా శివయ్య నాయుడు, చంద్రమతిగా రమణి నటించారు.

ఉద్యోగులు బాధ్యతతో పని చేయాలి

- క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించండి : ఈవో
- ఆలయ పరిధిలోని పలు అంశాలపై చర్చ



ఏఈవోలు, సూపరింటెండెంట్లతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రంలో ప్రతి ఉద్యోగి బాధ్యతతో పని చేయాలని ఈవో శీనానాయక్ చెప్పారు. దుర్గగుడి ఏఈవోలు, సూపరింటెండెంట్లు, ఇతర ముఖ్య అధికారులతో ఈవో శనివారం పలు అంశాలపై చర్చించారు. ఇటీవల ఆలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులతో పాటు అంతర్గత బదిలీల అనంతరం బాధ్యతలు తీసుకున్న ఉద్యోగులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి వారం ప్రధాన ఆలయాల ర్యాంకింగ్‌ను ప్రభుత్వం పరిశీలిస్తోందని, అందరూ కలిసి కట్టుగా పని చేసి ర్యాంకింగ్‌ను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఆలయ అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాలన్నారు. ఆలయ ప్రాంగణంలో అనేక చోట్ల పనికిరాని సామగ్రిని నెలల తరబడి వదిలేస్తున్నారని, వాటి వల్ల ఆలయంలో ఆధ్యాత్మిక దెబ్బతింటుందన్నారు. ముఖ్యంగా శానిటేషన్, సెక్యూరిటీ వ్యవస్థలపై పరిశీలన ఉండాలన్నారు. దేవస్థాన రవాణా వ్యవస్థపై ఉన్నత స్థాయిలో ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. అదే విధంగా సిబ్బంది తప్పనిసరిగా ఈవో, ప్రభుత్వ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

దుర్గాఘాట్‌పై చర్చ

భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే దుర్గాఘాట్‌పై ఈవో శీనానాయక్ సమావేశంలో చర్చించారు. దుర్గాఘాట్‌లో ఎంత మందికి హాకర్ లైసెన్స్‌లు ఇచ్చామనే అంశాన్ని పరిశీలించడంతో పాటు అక్కడ ఎంత మంది వ్యాపారాలు నిర్వహిస్తున్నారనే దానిపై తనిఖీలు చేపట్టాలన్నారు. హాకర్లకు కేటాయించిన స్థలం ఎంత, అద్దె బకాయిలు ఎంత మొత్తంలో ఉన్నాయనే అంశంపై నివేదిక ఇవ్వాలని అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ రంగారావును ఆదేశించారు.

ప్రొటోకాల్ దర్శనాలపై సమీక్ష

దుర్గగుడికి విచ్చేసే ప్రముఖులకు అమ్మవారి దర్శనంలో ఎదురవుతున్న ఇబ్బందులపై ఈవో సమీక్ష చేశారు. ప్రొటోకాల్ ఎవరికీ వర్తిస్తుంది.. ఎవరు సిఫార్సు చేస్తున్నారనే అంశాలను పరిశీలించాలని ఏఈవో ఎన్.రమేష్‌బాబుకు ఆదేశించారు. వీఐపీలు, సినీతారలతో ఫొటోల కోసం సిబ్బందితో పాటు ఆలయంలో పని చేసే వారు కూడా ఎగబడుతూ ఇబ్బందికరంగా వ్యవహరించడం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ప్రముఖులకు, వీఐపీలకు అమ్మవారి చిత్రపటం ఇచ్చే క్రమంలో సంబంధం లేని వ్యక్తులు ఫొటోలు దిగేందుకు ఉత్సాహాన్ని చూపడం సరికాదన్నారు. తిరుమల తరహాలో ఏ విధమైన కట్టుబాటు ఉందో అదే రీతిలో దుర్గగుడిపై అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఈఈ కోటేశ్వరరావు, ఏఈవోలు వెంకటరెడ్డి, ఎస్.తిరుమలేశ్వరరావు, కె.గంగాధర్, ఎంఎస్ఎల్ శ్రీనివాస్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పూలన్నీ నీ పూజకే స్వామి



స్వామివారికి పంచహారతుల సేవ నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు



పుష్పయాగం వీక్షిస్తున్న ఉభయదాతలు, భక్తులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసియున్న శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా నాలుగో రోజైన శనివారం స్వామి వారికి పుష్పయాగం, సాయంత్రం నగరోత్సవ సేవ నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికపై ఇరుదేవేరులతో కొలువు తీరిన స్వామివారికి భక్తులు వివిధ సుగంధ పరిమళాల పుష్పాలను సమర్పించారు. మరువం, ఎర్ర గులాబీలు, గులాబీలు, మల్లెలు, చామంతులు, కాగడాలు, సన్నజాజులు, విరజాజులు, కనకాంబరాలను రాశులుగా పోసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి ఒక్కో పుష్పరాశిని సమర్పిస్తూ పుష్పయాగం చేశారు. పుష్పయాగంలో భాగంగా స్వామి వారికి పంచహారతుల సేవ నిర్వహించగా, పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. రిటైర్డ్ డీసీపీ హరికృష్ణ, ఇరిగేషన్ శాఖకు చెందిన బత్తుల అప్పారావు, కె.లక్ష్మీ భవాని తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిత్య హోమం, మహాశాంతి హోమాలను ఆలయ అర్చకులు జరిపించారు.

కనులపండువగా నగరోత్సవం..

సాయంత్రం శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి నగరోత్సవ సేవ చిట్టినగర్‌లోని ఆలయం నుంచి ప్రారంభమైంది. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ గోవింద నామస్మరణ మధ్య నగరోత్సవం కనుల పండువగా సాగింది. చిట్టినగర్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు కేటీ రోడ్డు, నెహ్రూబొమ్మ సెంటర్, కోమల విలాస్ మీదగా తిరిగి ఆలయానికి చేరింది. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని దేవస్థాన కమిటీ, ఆహ్వాన కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలను మరుపిళ్ళ హనుమంతరావు, పిళ్లా శ్రీనివాసరావు, రాంపిళ్ల శ్రీనివాసరావు, మరుపిళ్ళ తాతారావు, మాకిన సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో గణపతి హోమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సంకటహర చతుర్థిని పురస్కరించుకుని శనివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గణపతికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నూతన యాగశాలలో గణపతి విగ్రహానికి ఆలయ అర్చకులు పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి హోమాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించగా, పలువురు భక్తులు, ఉభయ దాతలు హోమంలో పాల్గొన్నారు. సంకటహర చతుర్థిన స్వామి వారికి అభిషేకాలు, హోమం జరిపించుకోవడంతో సమస్యలు తొలగిపోయి, చేపట్టిన పనుల్లో విజయం సిద్ధిస్తుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

ముస్లింలను దగా చేసిన చంద్రబాబు



వించిపేట(విజయవాడపశ్చిమ): ఎన్నికలకు ముందు హజ్ యాత్రకు వెళ్లే ముస్లిం మైనార్టీలకు లక్ష రూపాయలు సబ్సిడీ ఇస్తామని వాగ్దానాలు చేసిన సీఎం చంద్రబాబు నేడు ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బాజీ బాబా విమర్శించారు. వించిపేటలోని తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే హజ్‌యాత్ర విషయంలో కూడా చంద్రబాబు మాటమార్చి ముస్లింలను దగా చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మొత్తం 2,873 మంది హజ్‌యాత్రికులకు రూ. 19.52 కోట్లను నేరుగా వారి ఖాతాలలో జమ చేయడంతోపాటు హజ్ క్యాంపు ఖర్చులకు అదనంగా రెండు కోట్ల రూపాయలు విడుదల చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు హజ్‌యాత్రికులకు లక్షరూపాయాలు సబ్సిడీ ఇస్తామని చెప్పి తీరా అధికారరంలోకి వచ్చాక సబ్సిడీ ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హజ్ యాత్రికులకు సబ్సిడీని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సంక్షేమ సంఘం



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న బేబి రాణి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల బేబి రాణి అన్నారు. ఏపీ బీసీ చైతన్య సంక్షేమ సంఘం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బీసీ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోషల్ ఇంజినీరింగ్ పేరుతో బీసీలకు సముచిత స్థానం కల్పించారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల పరిస్థితి మరలా మొదటికి వచ్చిందన్నారు. బీసీలపై జరుగుతున్న దాడులు, అన్యాయాలు, అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేషన్ పదవులు బీసీలకు కేటాయించడం లేదన్నారు. రాష్ట్రంలో జన గణనతో పాటు బీసీ కుల గణన చేపట్టాలని, బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామ స్థాయి నుంచి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని వాటిని పోస్టు కార్డుల ద్వారా సుప్రీంకోర్టుకు తెలియజేస్తామన్నారు. త్వరలోనే ఈ పోస్టు కార్డు ఉద్యమం చేపడతామని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు తోలేటి శ్రీకాంత్, నిడుముక్కల సాంబశివరావు, పాటూరి శ్రీనివాసరాజు, సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షురాలు పోలంపల్లి రాధ, రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సయ్యద్, తన్నీరు శ్రీను, యాదాద్రి తదితరులు పాల్గొన్నారు.